సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

క్లుప్తంగా

పేదలకు అన్నప్రసాదం పంపిణీ



పేదలకు అన్నప్రసాదం పంపిణీ చేస్తున్న ఎం.వి.రాజశేఖర్, సత్యనారాయణ, శైలజ

సీతంపేట: అక్కయ్యపాలెంలోని వాగ్దేవి పాఠశాల వద్ద పేదలకు ఆదివారం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాన్ని ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13 ఏళ్లుగా ప్రతి ఆదివారం పేదలకు అన్నప్రసాదం ఉచితంగా పంపిణీ చేస్తున్న ఎం.వి.వి.సత్యనారాయణ, శైలజ దంపతులను అభినందించారు. కార్యక్రమంలో కుమార్ శ్రీనివాస్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మతి స్థిమితం లేని వ్యక్తి అదృశ్యం



కనకారావు

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మతి స్థిమితం లేని ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. బర్మాక్యాంప్ జైభారత్‌నగర్‌లో కుటుంబంతో కలిసి నివసిస్తున్న పంపాన కనకారావుకు రెండు నెలలుగా మానసిక పరిస్థితి బాగోలేదు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ మందులు వాడుతున్నాడు. ఈ నెల 7వ తేదీ సాయంత్రం నూకాలమ్మ గుడి సమీపంలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి రాలేదు. అంతటా వెతికినా కనిపించకపోవడంతో కనకారావు భార్య పంపాన విజయలక్ష్మి ఆదివారం ఐదే పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ రామారావు కేసు దర్యాప్తు చేపట్టారు. కనకారావు 5.5 అడుగుల ఎత్తు, తెలుపు రంగు ఛాయ, ఇంట్లోంచి వెళ్లినప్పుడు బిస్కెట్ కలర్ షర్ట్, నలుపు ప్యాంట్ ధరించి ఉన్నాడు. ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని కంచరపాలెం పోలీసులు కోరారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ద్వారకా ఎస్ఐ ధర్మేంద్ర

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు ఎస్ఐ ధర్మేంద్ర కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. సమాజంలో ఎటువంటి అల్లర్లు, గొడవలు చేయకుండా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవించాలని సూచించారు. హద్దు మీరి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మీరు చేసే పనులపై ఎప్పటికప్పుడు పోలీస్ నిఘా ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని రౌడీషీటర్లకు ఎస్ఐ సూచించారు. అనంతరం రౌడీషీటర్లను వారి కుటుంబ సభ్యులకు పోలీస్ సిబ్బంది అప్పగించారు.

రామోజీరావుకు నివాళి



రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ రమణమూర్తి

సీతమ్మధార: రామోజీరావు మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని కళా హాస్పిటల్ అధినేత డాక్టర్ పి.వి.రమణమూర్తి అన్నారు. డాల్ఫిన్ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో రామోజీరావు చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ ఇటు పత్రికా రంగానికి.. అటు సినిమా రంగానికి రామోజీరావు ఎనలేని కృషి చేశారని కొనియాడారు. తమ ఆస్పత్రికి ఆయన వచ్చారని గుర్తు చేసుకున్నారు. హోటల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ నార్త్
8309817091
సాక్షి

గ్రామదేవతల పండగ శోభ

- నేడు సీతంపేట త్రిశక్తి ఆలయంలో తొలేళ్ల సంబరం
- రేపు పైడిమాంబ అమ్మవారి ప్రధాన జాతర
- 17, 18 తేదీల్లో అక్కయ్యపాలెంలో కుంచుమాంబ ఉత్సవం
- ముస్తాబైన ఆలయాలు, వీధులు



పైడిమాంబ అమ్మవారి పండగ మహోత్సవానికి ముస్తాబైన త్రిశక్తి ఆలయం



సీతంపేట వీధుల్లో విద్యుత్ దీపాలంకరణ



అక్కయ్యపాలెం మూడు గుళ్ల వద్ద అలంకరణలో కుంచుమాంబ అమ్మవారు

సీతంపేట: గ్రామదేవతల పండగలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. సీతంపేట, అక్కయ్యపాలెం గ్రామదేవతల పండగలతో సందడి వాతావరణం నెలకొంది. ఎన్నికల హడావిడి ముగియడంతో భారీ ఎత్తున పండగలు జరపడానికి ఆలయ కమిటీలు, గ్రామస్తులు సిద్ధమవుతున్నారు. సీతంపేట గ్రామదేవత త్రిశక్తి ఆలయంలో కొలువైన పైడిమాంబ అమ్మవారి మహోత్సవానికి శ్రీకృష్ణ యువజన సేవా సంఘం ప్రతినిధులు ఘనంగా ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగా ఆదివారం సీతంపేటలో అమ్మవారి పండగ చాటింపు జరిగింది. ఈ నెల 10న తొలేళ్ల సంబరం, 11న అమ్మవారి ప్రధాన జాతర జరుగుతాయని ఉత్సవ కమిటీ చైర్మన్ ఇసరపు రాజేష్‌బాబు తెలిపారు. సోమవారం తెల్లవారుజామున 3 గంటల నుంచి పురవీధుల్లో ఉజ్జీరీ బండి తిరుగుతుందని, సాయంత్రం 6 గంటల నుంచి తెల్లవార్లు తొలేళ్లే పండగ కొనసాగుతుందని చెప్పారు. ఈ నెల 11న పైడిమాంబ అమ్మవారి ప్రధాన పండగను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరోజు ఉదయం 5 గంటల నుంచి అమ్మవారి ఆలయంలో భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరుగుతాయి. సాయంత్రం 6 గంటలకు అమ్మవారి అనుపు ఊరేగింపు ఉంటుంది. సేవా గరిడీలు, కోయ డ్యాన్స్‌లు, ధూంధాం డ్యాన్స్‌లు, నేల డ్యాన్స్‌లు, తప్పిటగుళ్లు, కర్రసాము వంటి సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యుత్ దీపాలంకరణ, బాణసంచా అనుపు మహోత్సవానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. అదే రోజు సాయంత్రం సీతంపేట మెయిన్ రోడ్, రాధాకృష్ణ ఆలయం, గణేష్‌నగర్ శివాలయం వద్ద స్టేజ్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. భారీగా నిర్వహిస్తున్న పండగకు ఆహ్వానిస్తూ ఉత్సవ కమిటీ చైర్మన్ సీతంపేటలోని ఇంటింటికీ వెళ్లి ఆహ్వాన పత్రాలు అందజేస్తున్నారు

ఊరంతా విద్యుత్ వెలుగులు

గ్రామదేవత పండగ కావడంతో ఊరులోని ప్రతి వీధిని విద్యుత్ లైట్లతో అందంగా అలంకరించారు. అమ్మవారి ఆలయాన్ని విద్యుద్దీపాలు, వేపాకు తోరణాలు, పూల దండలతో ముస్తాబు చేశారు. అమ్మవారి ఆలయం నుంచి సీతంపేట మెయిన్ రోడ్‌కు వెళ్లే మార్గం, సీతంపేట కూడలి, గొల్లవీధి, నాయుడు వీధి, కనకమ్మ వీధి, శ్రీనివాస వీధి ఇలా



త్రిశక్తి ఆలయంలో పైడిమాంబ అమ్మవారు

ప్రతి వీధిని విద్యుత్ దీపాలు, ఎల్ఈడీ కటౌట్లతో దేదీప్యమానంగా తీర్చిదిద్దారు.

అక్కయ్యపాలెంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు

అక్కయ్యపాలెం గ్రామదేవత కుంచుమాంబ అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించడానికి గౌరీ సేవా సంఘం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 17న తొలేళ్లు, 18న అమ్మవారి ప్రధాన పండగ జరగనున్నాయి. అక్కయ్యపాలెం మూడుగుళ్ల వద్ద కొలువైన కుంచుమాంబ అమ్మవారి ఆలయం పండగకు ముస్తాబవుతోంది. ప్రధాన జాతరలో పలు సాంస్కృతిక, సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించడానికి ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది.

బాలికల పాపా హోంకు రెండు కంప్యూటర్ల వితరణ



పాపా హోం నిర్వాహకులకు కంప్యూటర్లు అందిస్తున్న రోటరీ క్లబ్ గవర్నర్ సుబ్బారావు

సీతమ్మధార: రోటరీ క్లబ్ విశాఖ పోర్ట్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ సీఎస్సార్ నిధుల నుంచి రెండు కంప్యూటర్లను సీతమ్మధారలోని బాలికల పాపా హోంకు వితరణ చేశారు. ఆదివారం పాపా హోం నిర్వాహకులకు కంప్యూటర్లను రోటరీ క్లబ్ గవర్నర్ ఆర్.వి.సుబ్బారావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాపా హోంలోని బాలికల విద్యాభివృద్ధికి ఉపయోగపడేలా కంప్యూటర్లు అందించామన్నారు. రోటరీ క్లబ్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. గౌరవ అతిథి మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ పూన మురళీకృష్ణ మాట్లాడుతూ బాలికలకు భవిష్యత్తులో క్యాన్సర్ బారిన పడకుండా ఉచితంగా వ్యాక్సిన్ వేస్తామని చెప్పారు. రోటరీ క్లబ్ విశాఖ పోర్ట్ సిటీ నిధులతో వీఎంఆర్‌డీఏ పార్క్ ఎదురుగా గల ఎంఎల్‌బీటీ స్కూల్‌కు రూ.2.50 లక్షలతో సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అప్పుఘర్ వద్ద గల ఫిషర్మన్ ప్రైమరీ స్కూల్‌కు రూ.1.20 లక్షలతో డైనింగ్ షెడ్ నిర్మించామన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు డి.వి.వర్మ, ఎస్ఎస్ఎన్ రాజు, కె.వి.రమణ, హోం అధ్యక్షుడు డి.సూర్యప్రకాశ్‌రావు, ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, బాలికలు పాల్గొన్నారు.

లోక కల్యాణార్థం రాజశ్యామల యాగం



రాజశ్యామల యాగంలో పాల్గొన్న భక్తులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం జాతీయ రహదారి పక్కన గల లక్ష్మీవినాయక ఆలయంలో ఆదివారం లోక కల్యాణార్థం శ్రీ రాజశ్యామల యాగం నిర్వహించారు. ఆలయ అర్చకుడు బాలానంద శివాచార్య స్వామి, జగదాంబ దంపతులు మంగళ ధ్వని, వేద మంత్రాల నడుమ శైవాగమ సంప్రదాయంలో దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ యాగం చేశారు. అనంతరం అమ్మవారికి అభిషేకం నిర్వహించి పుష్పాలతో అలంకరించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, ఉపాధ్యాయుల సుబ్రహ్మణ్య శర్మ, ప్రణతి, బాలానందన్, శ్రీ గురుపాద సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం : కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ పరిసరాల్లో వంటా వార్పు చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ చైర్మన్ లండా రమణ, సిబ్బంది, పాలకవర్గ సభ్యులు భక్తుల సౌకర్యాలు పర్యవేక్షించారు.

నవ్వుల్లో ముంచెత్తిన హాస్య వల్లరి



స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతంపేట: విశాఖ హ్యూమర్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన హాస్య వల్లరి ఆహుతులను కడుపుబ్బా నవ్వించింది. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రావి గోపీకృష్ణ, ఎస్.ఎస్.రామానుజం పర్యవేక్షణలో పలువురు కళాకారులు స్కిట్లు ప్రదర్శించారు. వీటిలో వైఫై పాస్‌వర్డ్, టైమెంత, పనిమనిషి, ఎందుకలా ఏడుస్తున్నావ్, క్రికెట్ పిచ్చి, బామ్మగారు కోర్టు సీను, భోషాణం పెట్టె, నా హృదయం కొట్టేసారు, మిఠాయి సత్యం, షాపింగ్‌కు వెళ్తున్నా ఏం కావాలి, పెళ్లి రెండు స్వీట్లు, వాడు మన స్టాఫ్ కాదు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ స్కిట్లు ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తాయి. కళాకారులు రావి గోపీకృష్ణ, రామానుజం, భానుప్రకాష్, డి.ఎస్.ఎన్.మూర్తి, ఆర్.ఎస్.ఎన్.మూర్తి, నాగగణేష్, నాయుడు, శివజ్యోతి, ప్రసన్న స్కిట్లు ప్రదర్శించి అలరించారు.

అలరించిన నృత్య ప్రదర్శన



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న వరప్రసాద్



నృత్యం చేస్తున్న విద్యార్థులు

మురళీనగర్: మురళీనగర్‌లోని డ్యాన్సర్స్ క్లబ్ ప్రథమ వార్షికోత్సవం వైశాఖి స్పోర్ట్స్ పార్కులో ఆదివారం ఘనంగా జరిగింది. వేడుకలను పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. మిస్ ఆంధ్రా తన్వి రిషిక ప్రత్యేకంగా తన నృత్యాన్ని ప్రదర్శించారు. డీ–16 చాంపియన్‌షిప్ టైటిల్ విజేత షాహిది స్టెప్పర్ ప్రదర్శన ఆహుతులను అలరించింది. విద్యార్థులకు వరప్రసాద్ ప్రశంసా పత్రాలు అందించారు.

ఘనంగా చిన్మయ మిషన్ మాతృ, పితృ పూజ



మాతృ, పితృ పూజలో పాల్గొన్న బాలబాలికలు

ఉక్కునగరం: చిన్మయ మిషన్, ఉక్కునగరం శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మాతృ, పితృ పూజ ఘనంగా నిర్వహించారు. చిన్మయ మిషన్ 40 ఏళ్లుగా నిర్వహిస్తున్న వ్యక్తిత్వ వికాస కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు స్వామి రఘువీరానంద ఆధ్వర్యంలో 'బాలల కూల్ క్యాంప్' నిర్వహించారు. క్యాంప్ ముగింపు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో తల్లిదండ్రులు భావోద్వేగానికి లోనయ్యారు. పిల్లలకు తల్లిదండ్రులపై గౌరరభావాలు పెంపొందించే విధంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంపై తల్లిదండ్రులు చిన్మయ మిషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం క్యాంప్‌లో పాల్గొన్న బాలబాలికలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మిషన్ కార్యదర్శి జయంతి కుమార్‌తో పాటు పలువురు స్టీల్‌ప్లాంట్ అధికారులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్



రసవత్తరంగా సాగుతున్న పోటీ

గోపాలపట్నం: గోపాలపట్నం హైస్కూల్ గ్రౌండ్‌లో ఎస్‌జే లారెన్స్ మెమోరియల్ వెటరన్స్ బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఆదివారం జరిగింది. గోపాలపట్నం క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నీని ఆర్గనైజర్ ఎస్ఎస్ ప్రకాష్, క్లబ్ ప్రెసిడెంట్ పి.రమణ పర్యవేక్షించారు. టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. శ్రీకాకుళం, కాకినాడ, విజయనగరం, నడుపూరు, బీహెచ్‌పీవీ, ఎస్‌బీబీసీ (గోపాలపట్నం), యలమంచిలి, విశాఖ ఫైవ్, ఆంధ్రా యూనివర్సిటీ, చోడవరం జట్లు పోటీ పడ్డాయి. టోర్నమెంట్ విజేతగా కాకినాడ నిలిచింది. రెండో స్థానం ఆంధ్రా యూనివర్సిటీ దక్కించుకుంది. అండర్–16లో బాలురు, బాలికల విభాగంలో శ్రీకాకుళం జట్టు ప్రథమ స్థానంలో నిలవగా.. ఎస్‌బీబీసీ(గోపాలపట్నం) రెండో స్థానంలో నిలిచింది. టోర్నమెంట్‌కు ఎస్. కొండలరావు, పి.రంగారావు తదితరులు సహకారం అందించారు.

డైరెక్టర్ పదవులకు వెంకటలక్ష్మి, రాయుడు శ్రీను రాజీనామా



కాయిత వెంకటలక్ష్మి

కంచరపాలెం: ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్(ఏపీఐడీసీ) డైరెక్టర్ పదవికి రాజీనామా చేసినట్లు కాయిత వెంకటలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన కార్పొరేషన్‌లో ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు సూచనల మేరకు జిల్లా నుంచి తనను ఏపీఐడీసీ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించిదన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమి చెందడంతో నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆమె చెప్పారు. తనకు అన్ని వేళలా సహాయ సహకారాలు అందించిన ఏపీఐడీసీ అధికారులు, చైర్‌పర్సన్, సహచర డైరెక్టర్లకు వెంకటలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

తాటిచెట్లపాలెం: ఏపీ శెట్టిబలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రాయుడు శ్రీనివాసరావు తన పదవికి ఆదివారం రాజీనామా చేశారు. ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీకి తన రాజీనామాను పంపించినట్లు ఆయన తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం సెక్షన్ పరిధిలోని హెచ్‌టీ లైన్లపై నిర్వహణ పనుల నిమిత్తం సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–1 ఈఈ(ఆపరేషన్స్) బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు నరసింహనగర్, రైతుబజార్ ప్రాంతం, రాఘవేంద్ర హాస్పిటల్ ఏరియా, ఫుడెక్స్ రోడ్, బాలయ్య శాస్త్రి లేఅవుట్, ఈటర్స్ స్పాట్ రెస్టారెంట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని కోరారు.

సామూహిక ధ్యానం విజయవంతం

పెదగంట్యాడ: వినాయక పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకురాలు జయలక్ష్మి ఆధ్వర్యంలో ఈ నెల 8,9 తేదీల్లో నిర్వహించిన సామూహిక ధ్యానం విజయవంతమైంది. ఈ సందర్భంగా కందుకూరు సీనియర్ పిరమిడ్ మాస్టర్ రామచంద్రమూర్తి మాట్లాడుతూ ధ్యానం చేయడం వల్ల ఆరోగ్యంతోపాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. పలు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూమెంట్ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలు జీవితంలో భాగం కావాలి



పోటీలను ప్రారంభిస్తున్న విశాల్ గున్నీ

డాబాగార్డెన్స్: ప్రతి ఒక్కరి జీవితంలో క్రీడలు భాగస్వామ్యం కావాలని విశాఖపట్నం రేంజ్ పోలీస్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ విశాల్ గున్నీ అభిప్రాయపడ్డారు. బీఎంసీసీ బిగ్ మ్యాన్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన క్రికెట్ లీగ్ ప్రారంభ పోటీల్లో పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ హోదాల్లో నిరంతరం సమాజాభివృద్ధికి కృషి చేస్తున్న వారంతా క్రీడలు ఆడటం ఆనందకరమన్నారు. క్రీడల ద్వారా మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండొచ్చన్నారు. క్రీడలకు వయస్సు అడ్డంకి కాదన్నారు. చార్టెడ్ అకౌంటెంట్స్, రోటరీ క్లబ్ ఇతర రంగాలకు చెందిన వ్యక్తులు క్రికెట్ ఆడటం సంతోషకరమన్నారు. బిగ్ మ్యాన్ క్లబ్ అధ్యక్షుడు, సీపీ తేజ, ఎస్ఎస్ఆర్ కార్యదర్శి డాక్టర్ సప్ప నరేష్ మాట్లాడుతూ ఈ పోటీలు వచ్చే నెల 28 వరకు ప్రతి ఆదివారం రైల్వే గ్రౌండ్ వేదికగా జరుగుతాయన్నారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

చురుగ్గా పాత్‌వే నిర్మాణ పనులు



వాకర్స్ పార్కు వద్ద పాత్‌వేకు ప్లాస్టరింగ్ పనులు చేస్తున్న కార్మికుడు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో ముఖద్వారాన్ని ఆనుకుని ఉన్న పాత్‌వే పనులు చురుగ్గా సాగుతున్నాయి. మురళీనగర్‌కు చెందిన ఒక దాత సహకారంతో ఈ పనులు చేపట్టినట్లు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి తెలిపారు. ఇప్పటికే పార్కులోని ప్రాంగణాన్ని 2,400 చదరపు అడుగులకు విస్తరించిన నేపథ్యంలో ప్రధాన ముఖద్వారం నుంచి పార్కులో ప్రవేశించే మార్గాన్ని ఆధునికీకరించే చర్యలో భాగంగా దీన్ని పునర్నిర్మిస్తున్నారు. ఆదివారం ఇందుకు సంబంధించిన పనులు నిర్వహించారు. త్వరలో సందర్శకులకు అందుబాటులోకి తెస్తామని చంద్రమౌళి చెప్పారు.

బ్రహ్మకుమారీల నూతన ధ్యానమందిరం ప్రారంభం



బ్రహ్మకుమారీస్ అగనంపూడి నూతన ధ్యాన మందిరం ప్రారంభోత్సవంలో పాల్గొన్న అతిథులు



కార్యక్రమంలో పాల్గొన్న ధ్యానులు, బ్రహ్మకుమారీలు

అగనంపూడి: బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం అగనంపూడిలోని దివ్య జ్యోతి భవనం సారథ్యంలో నిర్మితమైన ధ్యాన మందిరాన్ని ఆదివారం ప్రారంభించారు. ప్రస్తుతం ఉన్న భవనం ఆవరణంలోనే మూడో అంతస్తులో ధ్యాన మందిరం కోసం నిర్మించిన ఫ్లోర్‌ను ప్రారంభించారు. విశాఖ జిల్లా ఇన్‌చార్జ్ బీకె వేణి అక్కయ్య, కోఆర్డినేటర్ సోమేశ్వరి అక్కయ్య అగనంపూడి ఇన్‌చార్జ్ బీకే రామకోటి పర్యవేక్షణలో నిర్మాణం పూర్తి చేసుకున్న భవనాన్ని రాజస్థాన్‌లోని మౌంట్ అబూ నుంచి విచ్చేసిన బీకే వేడి భాయిజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగనంపూడి బ్రాంచ్ ద్వారా లోక కల్యాణం, విశ్వ శాంతి కోసం దివ్యజ్యోతి భవనం నిర్వాహకులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. చేస్తున్న కార్యక్రమాలను కొనియాడారు. వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి శిక్షణ పొందే 150 మంది బ్రహ్మకుమారీలు ఉండేందుకు వీలుగా సౌకర్యం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. విశాఖ జిల్లా ఇన్‌చార్జ్ బీకే వేణి అక్కయ్య మాట్లాడుతూ మనిషి ఆలోచనా విధానంలో మార్పులు తీసుకురావడానికి, ధ్యానంతో మానసిక ప్రశాంతతను కల్పించేందుకు వీలుగా ఇక్కడ ధ్యానులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. యోగా బట్టీలు నిర్వహించడం ద్వారా పరిసర ప్రాంతంలో పాజిటివ్ ఆలోచనలకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాజయోగి బీకే సోమేశ్వరి అక్కయ్య, ఇన్‌చార్జ్ రామకోటి, 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఇల్లపు ప్రసాద్, జి.పూర్ణానందశర్మ, నక్కా రమణబాబు, విద్యావేత్తలు టి.బలరామకృష్ణ, బొండా అప్పారావు మాస్టార్, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, ఎల్.వి.రమణ, వివిధ బ్రాంచ్‌ల ఇన్‌చార్జ్‌లు, ధ్యానులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ నార్త్
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com